క్లుప్తంగా

అయ్యప్పస్వామికి వెండి విల్లు, బాణం బహూకరణ

బేతంచెర్ల: పట్టణానికి చెందిన వాసగిరి తిరుపాలయ్య కుమారుడు విశ్వనాథం అయ్యప్ప స్వామికి శుక్రవారం రూ. 60 వేల విలువచేసే వెండి విల్లు, బాణం బహూకరించారు.అయ్యప్పసేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు గుండా జయ చంద్రయ్య, బచ్చు సుబ్రమణ్యానికి అందజేశారు. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజల అనంతరం దాతకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు చిన్ని కృష్ణ, ఉన్నం దివాకర్ చౌదరి పాల్గొన్నారు.

రీసర్వేకు రెండు గ్రామాలు ఎంపిక

కొలిమిగుండ్ల: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్షణ పథకం కింద మండలంలో కల్వటాల, తుమ్మలపెంట గ్రామాలు ఎంపికైనట్లు తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ శుక్రవారం తెలిపారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద రెండు గ్రామాలను ఎంపిక చేయడంతో సర్వేయర్ల బృందం గ్రామాల్లో సర్వే మొదలు పెట్టారన్నారు. రైతులు భూములకు సంబంధించి హద్దులు చూపించి సర్వేకు సహకరించాలని సూచించారు. ఈపథకం రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని, శాశ్వతంగా హద్దులు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టండి

కోవెలకుంట్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు, పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని తహసీల్దార్ పుష్ప కుమారి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అమడాల, కలుగొట్ల, గుళ్లదూర్తి గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేసి లేఔట్లు వేసి ఇళ్లపట్టాలు పంపిణీ చేశామన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేస్తోందన్నారు. బిల్లుతోపాటు లబ్ధిదారులుగా ఉన్న పొదుపు మహిళలకు రూ. లక్ష వరకు రుణ సౌకర్యం కల్పిస్తోందన్నారు. అయితే ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదన్నారు. వారం రోజుల్లో నిర్మాణాలు చేపట్టకపోతే ఇళ్ల పట్టాలు, పక్కాగృహాలు రద్దవుతాయని హెచ్చరించారు. హౌసింగ్ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

పశువైద్యశాల భవన నిర్మాణ పనుల పరిశీలన


కోవెలకుంట్ల: మండల కేంద్రం సంజామలలో రూ. 70 లక్షలతో చేపట్టిన ఏరియా పశువైద్యశాల నూతన భవన నిర్మాణ పనులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. మార్కెటింగ్‌శాఖ డీఈ సుబ్బారెడ్డి, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మోహన్‌రావు భవన నిర్మాణ పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరుకంతా భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ఆసుపత్రిలో పశువైద్యసేవలను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు.

క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని



బనగానపల్లె: మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఇదే గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డికి చెందిన 2023 నూతన సంవత్సరం క్యాలెండర్లను శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బండి జగదీశ్వరరెడ్డి, బత్తుల రామ్మోహన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, మాధవరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

ప్యాపిలి: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జనార్ధనరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన ప్యాపిలి-1, 2 సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులు, బయోమెట్రిక్‌ను పరిశీలించిన అనంతరం ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. పనితీరు మార్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సమయపాలన పాటించడంతో పాటు బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఈఓఆర్డీ బాలకృష్ణుడు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతం

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో పుష్యమాస పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆశ్రమంలో వెలసిన శ్రీ రమాదేవి సమేత సత్యనారాయణ స్వామికి అర్చకుడు ప్రభాకర్ శర్మ శాస్త్రోక్తంగా మంత్రాలు చదువుతూ అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి ఇచ్చారు. అ నంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆక్రమణలకు... ఇక చెక్ !

- శ్మశానవాటికలకు రక్షణ గోడలు
- రూ. 1.25 కోట్లతో ప్రహరీ నిర్మాణాలు



ప్యాపిలిలో శ్మశానవాటికకు నిర్మించిన ప్రహరీ

ప్యాపిలి: మృతదేహాలను ఖననం చేసేందుకు ఆరడుగుల స్థలం లేక పాత సమాధినే తవ్వి అంతిమ సంస్కారాలు నిర్వహించే పరిస్థితి.... సమాధిలో పూడ్చిన శవాలను కుక్కలు బయటకు తీసిన సంఘటనలు కోకొల్లలు... ఈ పరిస్థితులు గతంలో మండల కేంద్రం ప్యాపిలిలోని హిందూ శ్మశానవాటికలో కనిపించిన దృశ్యాలు. ప్రస్తుతం పరిస్థితి మారింది. ప్రజల సంక్షేమం , అభివృద్ధిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంతర్గత రోడ్లు, నీటి వసతుల కల్పన చేపట్టిన ప్రభుత్వం శ్మశాన వాటిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు అదే శ్మశానవాటికను సామాజిక వర్గాల వారీగా విభించారు అధికారులు. మూడు శ్మశాన వాటికలకు ప్రహరీ నిర్మించి అవసరమైన రక్షణ ఏర్పాటు చేశారు. ఆక్రమణలు తొలగించి ప్రహరీ ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విస్మరించిన గత ప్రభుత్వాలు..

గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు శ్మశానవాటికల అభివృద్ధిని విస్మరించాయి. ఫలితంగా శ్మశానవాటికలు ఆక్రమణలకు గురయ్యాయి. ఎవరైనా చనిపోతే మృతదేహాలను పూడ్చడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ప్రధాన సమస్యలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు చేపడుతోంది. ఆక్రమణలు తొలగిపోవడంతో శ్మశానవాటికలు విశాలంగా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మొత్తం 12 శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం డీఎంఎఫ్ నిధులు కేటాయించింది. రూ. 1.25 కోట్లతో ఆయా గ్రామాల్లోని శ్మశాన వాటికల్లో ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రహరీ నిర్మాణాలతో ఇక ఆక్రమణలకు చెక్ పడినట్లే.

శ్మశానవాటికల అభివృద్ధికి కేటాయింపు నిధులు ఇలా...

గ్రామం	పని విలువ లక్షల్లో
బోంచెర్వుపల్లి	రూ. 10 లక్షలు
బూరుగల	రూ. 15 లక్షలు
చిన్న పొదిళ్ల	రూ. 10 లక్షలు
జలదుర్గం (హిందూ శ్మశాన వాటిక)	రూ. 10 లక్షలు
జలదుర్గం (ముస్లి శ్మశాన వాటిక)	రూ.10 లక్షలు
మెట్టుపల్లి	రూ.10 లక్షలు
నల్లమేకలపల్లి	రూ. 5 లక్షలు
మాధవరం	రూ.10 లక్షలు
ప్యాపిలి (లింగాయత్, నేసే)	రూ. 10 లక్షలు
ప్యాపిలి (హిందూ అన్ని కులాలు)	రూ. 15 లక్షలు
ప్యాపిలి(ఆర్యవైశ్యులకు)	రూ. 10 లక్షలు
పీఆర్‌పల్ల	రూ. 10 లక్షలు
మొత్తం	రూ. 1.25 కోట్లు

గత ప్రభుత్వాలు విస్మరించాయి



శ్మశానవాటికల అభివృద్ధి గురించి గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై, శ్మశానవాటికల అభివృద్ధిపై దృష్టి సారించింది. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేస్తుండడంతో శ్మశానవాటికలకు ప్రహరీ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

– బోరెడ్డి శ్రీరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు

సమస్య తీరింది



శ్మశానవాటికలకు ప్రహరీ నిర్మాణాలు చేపట్టడంతో సమస్య తీరింది. అంతిమ సంస్కారాలు నిర్వహించే ప్రదేశంలో కుక్కలు, పందులు సంచారం ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రహరీ నిర్మాణాలు చేపడుతోంది. మండలంలో మొత్తం 12 శ్మశానవాటికల్లో ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

– గోకుల్ లక్ష్మి, ఎంపీపీ

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం



మండలంలో 12 శ్మశానవాటికలకు డీఎంఎఫ్ నిధులు దాదాపు రూ. 1.25 కోట్లు వెచ్చించి ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నాం. ఇప్పటికే ప్యాపిలిలో హిందూ శ్మశానవాటికలకు ప్రహరీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరి కొన్ని గ్రామాల్లో పనులు త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తాం. నిర్మాణ దశలో ఉన్న పనులు కూడా త్వరితగతిన పూర్తయేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రభాకర్‌రెడ్డి, పీఆర్‌ఏఈ

అదృశ్యమైన బాలుడి కథ సుఖాంతం



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఎస్‌ఐ మౌలానీ

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతూ అదృశ్యమైన బాలుడి కథ సుఖాంతమైంది. శుక్రవారం ఎస్ఐ మౌలానీ అందించిన సమాచారం మేరకు.. సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన మహేశ్వరీ కుమారుడు రాఘవేంద్ర గురువారం ఉదయం ఇంటి వద్ద నుంచి స్కూల్‌కు బయలు దేరాడు. చదువు విషయంలో కుమారుడిని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన రాఘవేంద్ర పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి వెళ్లలేదు. చుట్టుపక్కలవారిని విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించగా విద్యార్థి అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ మేరకు గాలింపు చర్యలు చేపట్టగా గురువారం పట్టణంలోని పాండురంగ స్వామి దేవాలయం సమీపంలో బాలుడిని గుర్తించిన పోలీసులు తల్లికి అప్పగించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

అవుకు: మొక్కజొన్న పంటను సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మెట్టుపల్లె పొలాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంటను సిబ్బందితో కలిసి ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి అవుకు మండలంలో 750 హెక్టార్లలో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం పంటను కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించామని, రైతులు సకాలంలో స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో వీఏఏలు మహేంద్ర, మధు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న సూర్యనారాయణరెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కోవెలకుంట్లలోని నాల్గవ గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు శుక్రవారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి భూమి పూజ చేశారు. ఇటీవల ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. సుంకులమ్మ ఆలయ సమీపంలో అంతర్గత రహదారి సరిగాలేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ మేరకు గ్రామ సచివాలయానికి కేటాయించిన నిధుల్లో రూ. 17 లక్షలు కేటాయించి154 మీటర్ల మేర సీసీ రోడ్డు, ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ ఖాన్, గ్రామ సచివాలయ సిబ్బంది హబీబా, ప్రసన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి ప్రసాద రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, చిన్న వెంకటసుబ్బారెడ్డి, కిషోర్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి ప్రభావతి

బేతంచెర్ల: చిన్న పిల్లలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి ప్రభావతి, మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని గొరిపేట నాల్గవ ఆరోగ్య ఉపకేంద్రాన్ని వారు తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్లు, ఏఎన్ఎంలకు కేటాయించిన గృహాల పరిధిలో నిమోనియాతో బాధపతున్న చిన్నారులను గుర్తించాలన్నారు. గర్భిణులు ప్రసవించే వరకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడమే కాకుండా సమీప వైద్యశాలల్లో వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అనంతరం పట్టణంలోని తహసీల్ పేట కాలనీల్లో ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యురాలు సౌమ్య, హెల్త్ సిబ్బంది రామాంజనేయులు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని రేవనూరు డాక్టర్ విద్యాసాగర్ సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలం దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దగ్గు, జలుబు, తదితర రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్న సలీంబాషా

బనగానపల్లెరూరల్: విద్యార్థులు అపజయాలకు భయపడరాదని, మనోధైర్యంతో ముందుకు సాగాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు సలీంబాషా సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సెట్కూర్ వారి సౌజన్యంతో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సలీంబాషా మాట్లాడుతూ విద్యార్థులు ఓ లక్ష్యం ఎంచుకుని పట్టుదలతో ప్రయత్నించాలని, అపజయాలు ఎదురైనా అంకితభావంతో పోరాడాలని సూచించారు. అపజయాలు ఉంటేనే జీవితంలో విజయాలు సాధిస్తారనే విషయాన్ని తెలుసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రశ్నలకు సమాధానాలు తెలిపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బడేసాహెబ్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కోటేశ్వర రావు, సెట్కూర్ సిబ్బంది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫాల్ట్ జోన్ పనులు పునఃప్రారంభం

అవుకు: అవుకు పట్టణ సమీపంలోని ట్విన్ టన్నెల్స్‌లో ఫాల్ట్‌జోన్ పనులు శుక్రవారం పునఃప్రారంభమయ్యాయ్యాయి. శ్రీశైలం నుంచి వరద నీటిని జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా అవుకు రిజర్వాయర్‌కు తరలించేందుకు దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అవుకు మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామ సమీపంలో 20వేల క్యూసెక్కుల సామర్థ్యంతో ట్విన్ టన్నెల్స్ నిర్మాణాన్ని చేపట్టారు. టన్నెల్ నిర్మాణ పనులు పూర్తవుతున్న తరుణంలో దాదాపు 160 మీటర్ల మేరా ఫాల్ట్‌జోన్ పడింది. అత్యాధునిక సాంకేతిక పరికరాలతో 125 మీటర్లు ఫాల్ట్‌జోన్ పనులను పూర్తి చేశారు. అయితే కొంతకాలంగా కొన్ని అనివార్యకారణాల వలన ఫాల్ట్‌జోన్ పనులు ఆగిపోయాయి. తిరిగి శుక్రవారం పనులను ప్రారంభించారు. త్వరలోనే పనులను పూర్తిచేస్తామని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: గ్రామ పంచాయతీతో పాటు జిల్లాల డెవలప్‌మెంట్‌పై ఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌కు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. శుక్రవారం వర్క్‌షాప్ ముగిసిన అనంతరం జెడ్పీ చైర్మన్ సాక్షి విలేకరితో మాట్లాడారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారని, బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్(బీపీడీపీ), డిస్ట్రిక్ పంచాయతీ డెవలప్‌మెంట్ (డీపీడీపీ) ప్లాన్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారన్నారు. త్వరలో జిల్లాలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వివరిస్తామన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా జెడ్పీ చైర్మన్ ఇండియా గేట్‌ను సందర్శించారు.

ఈ-క్రాప్ ప్రామాణికం

- రబీ పంటల నమోదును వేగవంతం చేయాలి
- ఈ నెల 15 వరకు పీఎం కిషాన్ ఈకేవైసీకి గడువు
- రబీ వరిసాగుకు ఎరువులు పుష్కలం
- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



క్షేత్రస్థాయిలో ఈ క్రాఫ్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

కోవెలకుంట్ల: వ్యవసాయ పథకాలు, పంటనష్టపరిహారం తదితర రాయితీల వర్తింపునకు ఈ-క్రాప్ ప్రామాణికమని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం కోవెలకుంట్ల, కలుగొట్ల రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. అలాగే ఆయా గ్రామాల పరిధిలో క్షేత్రస్థాయిలో పంటల నమోదును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి రైతులకు వివిధ పథకాలను వర్తింపచేస్తోందన్నారు. సాగు చేసిన పంటల వివరాలను ఆర్‌బీకేల్లో నమోదు చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటనష్టం జరిగితే ఈ క్రాప్ ఆధారంగా పంటనష్ట పరిహారం, ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో ఈ క్రాప్ అయిన పంట ఉత్పత్తులను మాత్రమే విక్రయాలకు అనుమతి ఉంటుందన్నారు. రైతులకు అవగాహన కల్పించి వందశాతం రబీ పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రబీ వరిసాగుకు కావాల్సిన రసాయన ఎరువులు ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే పీఎం కిషాన్ పథకం వర్తిస్తూ ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోని రైతులు ఈ నెల 15వ తేదీలోపు ఆర్‌బీకే, మీసేవ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి నిరంజన్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన చల్లా శ్రీలక్ష్మీ



నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డికి పుష్పగుచ్చం అందజేస్తున్న చల్లా శ్రీలక్ష్మీ

అవుకు: నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రఘువీర్ రెడ్డిని దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి సతీమణి, అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. అవుకు పట్టణంలోని పరిస్థితులపై చర్చించారు.

శ్మశానవాటిక స్థల ఆక్రమణపై ఫిర్యాదు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామ శివారులో దళితులకు కేటాయించిన శ్మశానవాటిక స్థల ఆక్రమణపై శుక్రవారం కాలనీవాసులు తహసీల్దార్ పుష్పకుమారికి వినతి పత్రం అందజేశారు. కొందరు శ్మశాన వాటికను ఆక్రమించుకుని పొలాలు సాగు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలం కబ్జా కావడంతో మృతదేహాలను ఖననం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బనగానపల్లె: మండలంలోని రామతీర్థం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందఆచారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ రచయిత యండమూరిరవీంద్రనాథ్ రచించించిన 'మొదటి ర్యాంకు- వంద సూత్రాలు' పుస్తకాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సుబ్బన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రహ్మానందఆచారి మాట్లాడారు. తెలంగాణా రాష్ట్రంలోని విద్యావారధి పౌండేషన్ సంస్థ సహకారంతో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశామన్నారు.

వరిలో కోత ప్రయోగం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని హనుమంతుగుండంలోని సర్వే నంబర్ 206లో శుక్రవారం వరిలో పంటలో కోత ప్రయోగం నిర్వహించారు. ఎకరాకు 14 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని వ్యవసాయాధికారి పవణ్ కుమార్ తెలిపారు. మండలంలో రబీలో 11300 ఎకరాల్లో పంటలు సాగు చేయగా 7625 ఎకరాల్లో మాత్రమే ఈ-క్రాప్ బుకింగ్ జరిగిందని తెలిపారు. అదేవిధంగా బి ఉప్పులూరు రైతు భరోసా కేంద్రాన్ని ఏఓ తనిఖీ చేశారు.

ముగ్గురికి వైఎస్సార్ బీమా అందజేత



బీమా సాయం అందిస్తున్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గోర్విమానుపల్లెకు చెందిన ముగ్గురికి వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన సాయాన్ని శుక్రవారం సర్పంచ్ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్ బాధిత కుటుంబాలకు అందజేశారు. ముత్తబోయిన చంద్రశేఖర్, పుప్పాల సాంబశివుడు, దండు కిట్టయ్య కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకం కింద ప్రభుత్వం ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున మంజూరు చేయడంతో బాధిత కుటుంబ సభ్యులు చంద్రకళ, సాంబశివుడు, లక్ష్మిదేవికి వారు అందజేశారు. అనారోగ్య కారణాలతో పాటు సహజ మరణం చెందిన ఎన్నో కుటుంబాలకు బీమా సాయం అండగా నిలుస్తుందని సర్పంచ్ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీడీఓ తదితరులు

ప్యాపిలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. మండల పరిధిలోని అలేబాదు తండాలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ చిన్న బాలూనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, మండల స్థాయి అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు అందనివారు ఉంటే సచివాలయాల్లో సంప్రదించాలని, ఎటువంటి సిఫారసు లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ బాలయ్య, నాయకులు ప్రవీణ్, వెంకటేశ్ నాయక్ బాలతారూ నాయక్, రామ్మూర్తి నాయక్, పెద్దస్వామి నాయక్, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధనగట్టులో గుప్తనిధుల కోసం తవ్వకాలు



తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

ప్యాపిలి: మండల పరిధిలోని సిద్ధనగట్టులో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగిన సంఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామ శివారులోని సిద్ధేశ్వర స్వామి ఆలయంలో దుండగులు ధ్వజస్తంభాన్ని తొలగించడంతో పాటు ఆ ప్రాంతలో పెద్ద గుంతను తవ్వారు. వారం రోజుల క్రితం గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఆలయం గ్రామానికి దూరంలో ఉండటంతో ప్రతి రోజు భక్తులు వచ్చే పరిస్థితి లేదు. దీంతో సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న జలదుర్గం ఎస్‌ఐ నరేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో చోరీ

ప్యాపిలి: మండల పరిధిలోని ఎన్ రంగాపురం గ్రామంలోని ఆలయంలో చోరీ జరిగింది. హుండీకి రంధ్రం చేసి ఉండటంతో నగదును చోరీకి గురయినట్లు గ్రామస్తులు గుర్తించారు. గ్రామస్తులు అదే గ్రామానికి చెందిన కృష్ణమోహన్ ఆచారి అనే యువకుడిని స్థంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కాగా హుండీలో ఉన్న నగదును ఈ నెల ఒకటో తేదీన తీసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎస్ఐ మౌలానీ అందించిన సమాచారం మేరకు.. ఇదేమండలంలోని గుళ్లదూర్తి గ్రామానికి చెందిన లక్ష్మి నరసయ్య, బాబయ్య ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బొలేరో వాహనంలో తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 15 క్వింటాళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

డోన్ రూరల్ : పట్టణం సమీపంలోని పోచా కాంపెక్స్ వద్ద శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన ధినేష్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్ అని పోలీసులు తెలిపారు.